జిల్లాల అభివృద్ధికి నడుం బిగించింది. వీటికి సమాంతరంగా ప్రజా సంక్షేమానికి అర్హులకు పెన్షన్లు, రైతుబంధు, రైతుబీమా, డబుల్ బెడ్‌రూం ఇండ్లు తదితర పథకాలను అమలుచేసింది. ఇలా అభివృద్ధి, సంక్షేమం ఒకదానికొకటి పూరకాలుగా సాగుతూ తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టాయి. ఈ పదేండ్ల విజయ ప్రస్థానం రాజధాని హైదరాబాద్‌లో మాత్రమే కాదు... తెలంగాణలో ఏ మూలన నిల్చున్నా స్పష్టంగా అనుభూతి చెందవచ్చు. 'నవ్వినోని ముందు బోర్లపడొద్దు' అన్న కసే పదేండ్ల అభివృద్ధికి కారణంగా నిలిచిందంటే అతిశయోక్తి కాదు.





**జీవధార చెరువు**

పూర్వం ఊరికి పిల్లను ఇవ్వమని అడగటానికి వచ్చినవారితో ఆడపిల్ల తరపువారు వేసే ప్రశ్న 'మీ ఊళ్లో ఎన్ని చెరువులున్నాయి?' అని! దీని అర్థం ఊళ్లు నీటితో కళకళలాడితే వ్యవసాయం, ఇతర అనుబంధ వృత్తులకు చేతినిండా పని దొరుకుతుందని. ఆ ఊళ్లో బతికే కుటుంబాలు ఎవరి ముందూ చేయి చాచకుండా సుభిక్షంగా ఉంటాయని. ఇలా వందల ఏండ్లు పల్లెలకు ఆహారాన్ని ఖాయం చేసిన వేలాది చెరువులను అభివృద్ధి మార్గంగా ఉద్యమకాలం నుంచి తెలంగాణ సమాజం భావించింది. కాబట్టే, ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిన మరుక్షణమే చెరువులను బాగుచేసుకోవాలని సంకల్పం చేసుకున్నాం. మిషన్ కాకతీయ పేరుతో మొత్తం 46,531 చెరువులను పూడికతీసి, మరమ్మతులు చేసి గ్రామీణ జనజీవనానికి కేసీఆర్ సర్కారు అంకితమిచ్చింది. అంతేకాదు... చెరువు ఆదరువుగా ఆధారపడిన రైతులతోపాటు ముదిరాజులు, గొల్లకుర్మలు, గీతకారులు మొదలైన కులవృత్తుల జీవనోపాధికి బలమైన బాటలు వేసింది. మత్తడి దుంకే చెరువుకట్ట మీద పుట్టినరోజు జరుపుకొని సంభ్రమాశ్చర్యాలకు లోనైన 'వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా' రాజేంద్రసింగ్... 'చిన్ననీటి వనరుల వినియోగంలో ఇప్పుడే ఏర్పడిన రాష్ట్రమే అయినా తెలంగాణ దేశానికి నీటిపాఠాలు నేర్పింది' అని కీర్తించారు. దానికి సాక్ష్యం నెక్కొండ చెరువు కట్ట.

**పొలాలకు మళ్లిన నదులు**

'ఇంకుడుగుంతలు మాకు, నదులూ కాల్వలూ మీకా? ' అని కరీంనగర్ ఎస్సారార్ కళాశాల వేదికగా గర్జించిన గొంతుక వెనుక (సింహగర్జన 2001) నెర్రెలుబారిన నేలనే కాదు.. పడావుపడ్డ సాగునీటి ప్రాజెక్టులు, ఆ ప్రాజెక్టుల కింద తవ్విన పిల్లకాల్వల్లో నీళ్లకు బదులు సర్కారు తుమ్మల దృశ్యాలను దిగమింగి సరికొత్త తెలంగాణను ఆవిష్కరించుకోవాలన్న తండ్లాటలో భాగంగా ప్రాజెక్టుల రీడిజైనింగ్ కేసీఆర్ ప్రభుత్వానికి ఆవశ్యకమైంది. తలాపున పారుతున్నా... తలంటుకు నీళ్లు ఇవ్వని గోదావరి, కృష్ణవేణమ్మలవి నిజానికి వట్టిపోయిన పారకాలు కావు... సజీవజలధారలు. అయితే తెలంగాణ భౌగోళిక అననుకూలతల వల్ల వాటిని వందల మీటర్ల ఎత్తుకు తోడిపోసుకోవటం తప్ప గత్యంతరం లేదు. పాకాల, రామప్ప, గణపసముద్రం, గండిపేట, హిమాయత్‌సాగర్ సహా అక్కడక్కడా ఉన్న మధ్యతరహా నీటి ప్రాజెక్టులు మాత్రమే మిగిలాయి. ఈ పరిస్థితుల్లో నవ తెలంగాణ నీటి గలగలల సవ్వడిని కలగన్నది. తెలంగాణ తనను తాను పునర్నిర్వచించు కొన్న తరువాత అప్పటిదాకా పడావుపడ్డ (పెండింగ్) ప్రాజెక్టులను పూర్తి చేసుకున్నది.

దానికి అనుగుణంగా కేసీఆర్ అసెంబ్లీలో పవర్‌పాయింట్ సాక్షిగా విశ్వాసాన్ని కల్పించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయటం, కొత్త ప్రాజెక్టుల నిర్మాణం అనివార్యమయ్యాయి. ఎవరు అవునన్నా... కాదన్నా... ఒప్పుకొన్నా... ఒప్పుకోకపోయినా కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధాన భాగమైన మేడిగడ్డే తెలంగాణ జీవగడ్డ. కాళేశ్వరం ప్రాజెక్టే తెలంగాణ భూములకు జీవధార. రైతులకు వీలైనంత తొందరగా

## సుపీరియారిటీ కాంప్లెక్స్ తగ్గించుకున్నరు



తెలంగాణ ఏర్పడినంక సాంస్కృతిక రంగంలో కవులు, కళాకారులు, రచయితలకు విశేష ఆదరణ దక్కింది. యాదగిరిగుట్ట ఉద్ధరణ, బతుకమ్మ పండుగకు దేశం మొత్తం మీద కీర్తి రావడం గొప్ప విషయాలు. ప్రజలు 'ఇది నా తెలంగాణ' అని గొప్పగా భావించే అస్మిత ఏర్పడింది. అంతకుముందు 'మనం అడుగున ఉన్నం' అనుకునేవాళ్లు. తెలంగాణ ప్రజలు స్వాభిమానాన్ని ప్రకటించుకోవటం వల్ల ఆంధ్ర ప్రాంతం వాళ్లలో ఇంతకుముందున్న సుపీరియారిటీ కాంప్లెక్స్ తగ్గింది. వాళ్లు కూడా మనల్ని కలుపుకొనే ప్రయత్నం చేస్తున్నరు. దీంతో రెండు ప్రాంతాల ప్రజల మధ్య సఖ్యత.. సమగ్రత సాధ్యపడింది. ఇక రాజకీయాలు పక్కనపెడితే సాగునీటి విషయంలో ప్రజలకు చాలా వరకు మేలు జరిగింది.

• **ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య**,
విశ్రాంత ఆచార్యులు, తెలుగు శాఖ,
కాకతీయ విశ్వవిద్యాలయం

## అనేక రంగాల్లో అగ్రస్థానం



సుదీర్ఘ పోరాటం ఫలితంగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం తనను తాను పునరావిష్కరణ చేసుకొని పునర్నిర్మించుకునే ప్రణాళికను రూపొందించుకోవటంలోనే తొలి విజయాన్ని నమోదు చేసింది. వనరుల లభ్యత, వినియోగం, ప్రభుత్వ ప్రాధాన్యాంశాలు ఎంచుకోవటం, వాటికి సంబంధించిన ఆచరణ వల్లనే ఇవాళ తెలంగాణ దేశంలో అనేక రంగాల్లో అగ్రభాగాన నిలబడింది. వరి సహా అనేక పంటల ఉత్పాదకత రెట్టింపు అయింది. ఇక జిల్లాల పునర్విభజనను ప్రస్తుత అవసరాల కోణంలో కాకుండా దీర్ఘకాలిక దృష్టితో ఆలోచించాలి. అలాగే గురుకుల విద్యాలయాలను 1,100కు పెంచటం, రాష్ట్రంలోని 5 లక్షల మంది విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్యను అందుబాటులోకి తేవటం మానవ వనరుల అభివృద్ధికి దోహదపడే అద్భుతమైన అంశం. ప్రభుత్వ అధీనంలోనే 33 మెడికల్ కాలేజీలు ఉండటం ఒక్క తెలంగాణలో తప్ప దేశంలో మరెక్కడా లేదు.

• **ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి**,
టీఎస్‌పీఎస్సీ, మాజీ చైర్మన్

